
సాక్షి బాపట్ల

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



సత్రశాలకు పోటెత్తిన భక్తులు

రెంటచింతల: కార్తికమాసం సందర్భంగా సత్రశాల గంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి గుడికి గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.60 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,538 క్యూసెక్కులు వదిలారు.

త్రికోటేశ్వర దివ్య నామావళి

నరసరావుపేట: శ్రీ మేధా దక్షిణామూర్తి భక్త సమాజం, శ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి వారి దివ్య నామావళి ఆడియోను ఎమ్మెల్యే గోపిరెడ్డి గురువారం విడుదల చేశారు.



న్యూస్‌రీల్

నేడు ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్

బాపట్ల : ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం ప్రతి నెలా మూడో శుక్రవారం కలెక్టరేట్‌లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్ల కలెక్టరేట్‌లో ఉదయం12.00 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఉద్యోగులు ఎవరైనా ధైర్యంగా తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లదలచిన ఉద్యోగులకు అధికారులు అనుమతులు ఇవ్వాలని, ఆటంకపరచరాదన్నారు. జిల్లా అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

డైక్ సెంటర్‌లో పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లోని జిల్లా సత్వర చికిత్సా కేంద్రం (డైక్‌సెంటర్)లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు సమస్యలు ఉన్న పిల్లలకు పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి హియరింగ్ ఎయిడ్ (వినికిడి యంత్రాలు) అందజేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ఆదేశాల మేరకు జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ కీర్తి, పలువురు పారా మెడికల్ సిబ్బంది, డైక్ మేనేజర్ పావులూరి నాగగిరీష తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీలో స్థాయీ సంఘాల భేటీ

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో భేటీ కానున్నాయి. సమావేశాల్లో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జెడ్పీ బడ్జెట్ ప్రతిపాదనలపై చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన చర్చించనున్నారు. స్థాయీ సంఘంలో ఆమోదం పొందిన తరువాత బడ్జెట్ ప్రతిపాదనలను త్వరలో జరగనున్న సర్వసభ్య సమావేశానికి పంపనున్నారు. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. అదే విధంగా వ్యవసాయంపై 3వ స్థాయి సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘానికి తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షత వహించనున్నారు.

స్టాఫ్ నర్సులకు నియామక ఉత్తర్వులు



గుంటూరుమెడికల్ : నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలకు ఎంపికైన 42 మందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు గురువారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉద్యోగాలు పొందిన వారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఎం డీపీఓఎం డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, పరిపాలన అధికారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

యార్డులో 29,247 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 29,055 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,247 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,000 నుంచి రూ.22,500 వరకు పలికింది.

అణగారిన వర్గాల అభ్యున్నతికే కుల గణన

మంత్రి మేరుగ నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున, వేదికపై ఎమ్మెల్యే కోన, కలెక్టర్ రంజిత్ బాషా

బాపట్ల: పేద ప్రజలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే కుల గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. ఏపీ రాష్ట్ర కుల గణన–2023పై జిల్లాస్థాయి సదస్సు గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించారు. అన్ని కుల సంఘాల నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంచార జాతులతోపాటు కులాల మధ్య అంతరాలను తొలగించడానికే కులగణన నిర్వహించనుందని మంత్రి తెలిపారు. 91 సంవత్సరాల తర్వాత ఏపీలో సామాజిక పరిస్థితులను గుర్తించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అసమానతలు, భిన్నాభిప్రాయాలు ప్రజలలో తొలుగుతాయన్నారు. స్పష్టమైన వివరాలు ఉంటేనే అణగారిన వర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు, నిధుల కేటాయింపులకు ప్రణాళిక రూపొందించే అవకాశం ఉంటుందన్నారు. కులగణన కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు భాగస్వాములు కావాలని, అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. సామాజిక వర్గాల వారీగా ప్రజల సంఖ్య స్పష్టంగా తెలిసే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆయా వర్గాలలో సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి వీలుంటుందన్నారు. అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, పెరియార్ వంటి మహనీయుల స్ఫూర్తితో, ప్రజల ఆలోచన విధానాలకు తగినట్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు.

సమగ్రాభివృద్ధి కోసమే కుల గణన

సమీకృత సమగ్రాభివృద్ధి కోసమే కుల గణనను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి ఏపీ రాష్ట్ర కుల గణన కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగుతుందన్నారు. మిగిలిపోయిన కుటుంబాలను డిసెంబర్ 10వ తేదీలోగా చేర్చనున్నట్లు తెలిపారు. భారతదేశంలో 1872 సంవత్సరంలో బ్రిటిష్ పాలకులు కుల గణన నిర్వహించారని, తదుపరి 1931లో స్వాతంత్ర్యానికి ముందుగానే కలగణన జరిగిందన్నారు. సంక్షేమశాఖల ఆధ్వర్యంలో కుల గణన జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలను సమానంగా అర్హులైన నిరుపేదలందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని సామాజిక వర్గాలకు పూర్తిగా న్యాయం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కుల గణన సర్వే కోసం అత్యంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రత్యేక యాప్ ప్రవేశ పెట్టిందన్నారు. గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్‌లు ప్రతి ఇంటింటికి తిరిగి కుల గణన సర్వేలో పాల్గొంటారన్నారు. సర్వేలో ప్రజల నుంచి సేకరించే కుటుంబ వివరాలు అత్యంత గోప్యంగా ఉండేలా సాఫ్ట్‌వేర్ పనిచేస్తుందని వివరించారు. ప్రజలంతా సహకరించేలా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు.

నేడు అధికారులకు ప్రత్యేక శిక్షణ

మండల, మున్సిపల్ స్థాయిల్లో శుక్రవారం అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ జరుగుతుందన్నారు. ఈనెల 25వ తేదీ వరకు ప్రజల వద్దకు వెళ్లి వలంటీర్లు జన గణనపై సమాచారం చేరవయ్యాలన్నారు. కుటుంబంలోని వ్యక్తుల వివరాలు, విద్యా అర్హతలు, తాగునీటి సదుపాయం, కులం, ఉప కులం, వ్యవసాయ భూమి, నివాస స్థలం, పశువుల వివరాలు మాత్రమే సర్వే ద్వారా సేకరిస్తారని చెప్పారు.

పారదర్శకంగా నిర్వహించండి

అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా కుల గణన నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల సంఘాల నాయకులు కోరారు. కులాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు సంక్షేమ పథకాల అమలులో రిజర్వేషన్లు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాల జారీని అరికట్టాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యే కోన రఘుపతి, డీఆర్వో వెంకటరమణ, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు జి రవీందర్, పి.సరోజిని, బి.సి.హేలా షారాన్, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు జె.రాజాదిబోరా, బి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో కోచింగ్

చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–2 ఉద్యోగాల పోటీ పరీక్షలకు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో కోచింగ్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 27న ఉదయం 10 గంటలకు పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామం శివారులోని కౌండిన్యపురంలోని కౌండిన్య భవన్‌లో ఈ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. తరగతులకు పక్కా ప్రణాళికతో సివిల్స్ కోచింగ్ నిపుణులు, కమర్షియల్ ట్యాక్స్ విశ్రాంత అడిషనల్ కమిషనర్ వై.సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. శిక్షణ తరగతులలో వివిధ రంగాలలో నిపుణులైన, అనుభవం ఉన్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ప్రొఫెసర్ ఎం.కోటేశ్వరరావు, సలీం ఖాన్, విల్సన్, మల్లేష్, మస్తాన్ తదితరులు పాల్గొంటారని వివరించారు. గ్రూప్–2 పోటీ పరీక్షలలో విజయం సాధించాలనే పట్టుదలతో యత్నించే విద్యార్థులు వివరాలకు 6303846696 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

20 నుంచి మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

సాక్షి, అమరావతి: పట్టణ స్వయం సహాయక సంఘ సభ్యులకు సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మెప్మా ఎండీ వి.విజయలక్ష్మి గురువారం తెలిపారు. దీనిలో భాగంగానే 'పట్టణ ప్రగతి యూనిట్లు' పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. స్వయం ఉపాధిపై ఆసక్తి కలిగిన పట్టణ సమాఖ్యలోని మహిళలను గుర్తించి ఆరు విభాగాల్లో సంపూర్ణ శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు నైపుణ్య, వ్యాపారాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. ఈ నెల 20 నుంచి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా 167 పట్టణ సమాఖ్యల నుంచి ఎంపిక చేసిన మహిళలకు గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీ ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

దిశ యాప్ ఉంటే...పోలీస్ మీ వెంటే

- జిల్లాలో ఇప్పటివరకు 3.84 లక్షల మొబైల్స్‌లో యాప్ డౌన్‌లోడ్
- గురువారం ఒక్కరోజే 16 వేలు డౌన్‌లోడ్
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: దిశ యాప్ మీ ఫోన్‌లో ఉంటే పోలీసులు మీ వెంట ఉన్నట్లేనని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా దిశ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 3,84,400 మొబైల్ ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసి రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. గురువారం ఒక్కరోజే 16 వేల మొబైల్ ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసి రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది వార్డు, సచివాలయ మహిళ పోలీసులు వారి పరిధిలోని గ్రామాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్ ముఖ్యమైన కూడళ్లు, కాలేజీలు, స్కూళ్లు, ఫ్యాక్టరీల్లో దిశ యాప్ మెగా డ్రైవ్ నిర్వహించి ప్రజలకు దిశ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన దిశ యాప్‌ను మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడే దిశ యాప్‌కు సార్థకత చేకూరుతుందన్నారు. దిశ యాప్‌పై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి వారి మొబైల్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్టర్ చేసుకొనేందుకు జిల్లా వ్యాప్తంగా మెగా డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. యాప్ రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మీ వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. దిశ యాప్ కేవలం మహిళలకే కాకుండా ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందన్నారు.



దిశ యాప్ డౌన్‌లోడ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ముగిసిన తిరునక్షత్ర వేడుకలు



ఏకోత్తర సహస్ర కలశాభిషేకంలో పాల్గొన్న మహిళా భక్తులు(ఇన్‌సెట్‌లో) సీతారామ చంద్రులకు ఏకోత్తర సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తున్న చిన జీయర్‌స్వామి

తాడేపల్లిరూరల్ : సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమంలో నిర్వహిస్తున్న 67వ తిరు నక్షత్ర వేడుకలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ సీతారామ చంద్రుల విగ్రహానికి వైభంగా ఏకోత్తర సహస్ర కలశాభిషేకం నిర్వహించామని తెలిపారు. 1993లో సీతారామచంద్రుల విగ్రహాన్ని కొంతమంది దొంగలు దొంగిలించారని, ఆనాటి కాలంలో పోలీస్ అధికారిగా వున్న కోటేశ్వరరావు ఆ విగ్రహాన్ని వెతికి తీసుకువచ్చారని తెలిపారు. అలా తిరిగి వచ్చిన విగ్రహానికి సీతానగరం చిన జీయర్‌స్వామి ఆశ్రమంలో కలశాభిషేకం నిర్వహించామని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు పొందారని ఆయన తెలిపారు.

సామాజిక న్యాయానికి ప్రతిరూపం జగనన్న పాలన

- రాజ్యాధికారంలో బడుగు వర్గాలకు పెద్దపీట
- సంక్షేమంతో పేదల ఆర్థికాభివృద్ధి
- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



బీద మస్తాన్‌రావు, శివకుమార్, రాధిక రమేష్‌లకు గజమాల వేసిన అభిమానులు

తెనాలి: దేశచరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతోందని, దీనికి తనలాంటి ఎందరో ప్రత్యక్ష నిదర్శనమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ బీద మస్తాన్‌రావు అన్నారు. తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేసిన తాడిబోయిన రాధికరమేష్ అభినందన సభను గురువారం సాయంత్రం పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారీ ర్యాలీ అనంతరం స్థానిక శివాజీచౌక్‌లో ఏర్పాటైన బహిరంగ సభకు మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ 35 ఏళ్ల టీడీపీ పాలనలో లేదా 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు హయాంలో రాజ్యసభకు బీసీలను ఎంపిక చేసిన దాఖలా లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎనిమిది రాజ్యసభ సీట్లకు అవకాశమొస్తే, అందులో నలుగురిని బలహీనవర్గాల నుంచి ఎంపిక చేయటం చిరస్మరణీయమైన మైలురాయిగా అభివర్ణించారు. 25 మంది మంత్రుల్లో 17 మంది, 48 మంది ఎమ్మెల్సీల్లో 28 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలేనని చెప్పారు. శాసనసభ స్పీకర్‌తో సహా, శాసనమండలిలోని కీలక పదవుల్లోనూ, ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురిని ఆ వర్గాలనే నియమించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందన్నారు. బడుగులకు ఎలాంటి రాజ్యాధికారం కల్పించని చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని మస్తాన్‌రావు గుర్తుచేశారు. బడుగులకు రాజ్యాధికారంతోపాటు సంక్షేమంతో వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు తోడుగా ఉండాలనే సంకల్పంతో 30 ఏళ్లుగా ఉంటున్న టీడీపీని వదిలేసినట్టు మస్తాన్‌రావు చెప్పారు. ఓసీ మహిళకు రిజర్వు అయిన తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని తొలివిడతగా ముస్లిం మైనారిటీకి, ఇప్పుడు బీసీ యాదవ మహిళకు ఇవ్వడం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సాహసానికి నిదర్శనమన్నారు. పట్టణంలో ఏదైనా అభివృద్ధి పనికి తన ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయిస్తానని మస్తాన్‌రావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన ప్రసంగంలో, సంక్షేమం, అభివృద్ధి బాటలో పయనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలోనే నియోజకవర్గంలో ఎన్నడూ అవకాశాలు దక్కని కులాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తున్నామని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీపీ, వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ ఎంపికలు ఇందుకు ప్రత్యక్ష నిదర్శనాలుగా చెప్పారు. కార్యక్రమంలో ఇంకా మున్సిపల్ వైస్‌ఛైర్మన్ అత్తోట నాగవేణి, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, రాళ్లబండి సుష్మ, పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, పార్టీ నేతలు తాడిబోయిన రమేష్, తట్టుకూళ్ల అశోక్‌యాదవ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు.

ముగ్గురు ఉద్యోగుల సరెండర్‌కు ఆదేశం

- జీజీహెచ్‌కు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఉన్నతాధికారులు
- ఫైల్స్ పెండింగ్‌లో ఉండటంపై ఆగ్రహం



గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ కార్యాలయ ఉద్యోగులకు నిర్లక్ష్యపు జబ్బు చేసింది. ఫలితంగా ఆస్పత్రి సిబ్బందికి రావాల్సిన ఎరియర్స్, ఇతర బెనిఫిట్స్, పదోన్నతులు సకాలంలో అందడం లేదు. దవాఖానాలో పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల్లోనూ కార్యాలయ సిబ్బంది తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఫైల్స్ క్లియరెన్సులోనూ అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో పలువురు తరుచుగా కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. దీనివల్ల రాష్ట్ర ఉన్నతాధికారులు కోర్టు బోన్లలో నిలబడాల్సిన దుస్థితి నెలకొంటోంది. ఈ తీరుపై విసిగిన రాష్ట్ర ఉన్నతాధికారులు తీవ్ర చర్యలకు ఉపక్రమించారు. ముగ్గురు ఉద్యోగులను ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం నుంచి మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రతి పనీ జాప్యమే

జీజీహెచ్ కార్యాలయంలో ప్రతిపనిలో జాప్యం జరుగుతోందని పలుమార్లు స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు వెళ్లాయి. ఆస్పత్రిలో ఉద్యోగాల భర్తీలోనూ నిబంధనలు పాటించకపోవడం, పోస్టుల భర్తీని సుదీర్ఘ కాలం తాత్సారం చేయడం, ఉద్యోగులు తరచూ విధులకు గైర్హాజరు కావడం, సొంతపనుల్లో నిమగ్నం కావడంపైనా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్తానే ఉన్నాయి. ఆస్పత్రికి ఆదాయం తీసుకొచ్చే సైకిల్ స్టాండ్ టెండర్లు, డైట్ టెండర్లపై ఉద్యోగులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడంపైనా జిల్లా ఉన్నతాధికారులకు కోర్టుల నుంచి ఆదేశాలు అందాయి. ల్యాబ్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి తన పదోన్నతిపై ఆస్పత్రి అధికారులు న్యాయం చేయడం లేదని ఇటీవల కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసులో కౌంటర్ దాఖలుకు రాష్ట్ర ఉన్నతాధికారులు జీజీహెచ్‌ను సమాచారం కోరారు. అయితే ఈ సమాచారం ఇవ్వడంలో జీజీహెచ్ కార్యాలయ ఉద్యోగులు అలసత్వం ప్రదర్శించారు. దీంతో ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసి ముగ్గురు కార్యాలయ ఉద్యోగులను సరెండర్ చేయాలంటూ ఉత్తర్వులు విడుదల చేశారు.

త్వరలో ఉద్యోగులతో సమావేశం

కార్యాలయ ఉద్యోగులను సరెండర్ చేయాలంటూ డీఎంఈ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యాలయ ఉద్యోగుల్లో ఉన్న నిర్లక్ష్య ధోరణిపై ఫిర్యాదులు వస్తున్న మాట నిజమేనని పేర్కొన్నారు. త్వరలో ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రయోగం.. విజ్ఞాన యోగం

- జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనల్లో విద్యార్థుల ప్రతిభ
- రాష్ట్రస్థాయి పోటీలకు ఏడు ప్రాజెక్టుల ఎంపిక



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

బాపట్లఅర్బన్: జిల్లాస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెట్టారు. సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు ప్రదర్శించి ఆలోచింపజేశారు. వారి వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ చతురతను ప్రదర్శించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యా శాఖ, ఇతర సంస్థల సౌజన్యంతో ఏర్పాటుచేసిన పోటీల్లో జిల్లాలోని 25 మండలాల నుంచి 93 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. జాండ్రపేట బీవీ అండ్ బీఎస్ ప్రభుత్వ పాఠశాలలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్కాస్ట్) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ సాధిక్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 93 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారని, ఏడు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. డీఈఓ పీవీజే రామారావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. న్యాయనిర్ణేతలుగా లేళ్ల లీలాకృష్ణ, వలివేటి వెన్నెల, కిరణ్ నందమూడి, మీర్జాన్ వ్యవహరించగా అప్కాస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ సాధిక్, న్యాయవాది పన్నెం మల్లికార్జునబాబు, అకడమిక్ కో ఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్ పెనుగొండ పూర్ణచంద్రరావు, యన్నం యల్లమందేశ్వరరావు, పద్మ, లక్ష్మీసుధ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

గుంటూరు జిల్లాలోని కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు బాపట్ల జిల్లా నుంచి బీ.కళ్యాణి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుళ్లపల్లి) ప్రదర్శించిన మీనామృతం, వీ శ్రావ్య (జెడ్పీ హెచ్ఎస్, వడ్డేవారిపాలెం) ప్రదర్శించిన హనీ బీ ట్రాన్స్ ఫార్మింగ్, రాగ నాగ అనిషిత (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మక్కెన వారిపాలెం) ప్రదర్శించిన గ్రీన్ వాష్, పీ అంకిత (ఎస్వీకే హైస్కూల్, గంగవరం) ప్రదర్శించిన బుల్లెట్ మిల్లెట్స్, కే.భవ్యశ్రీ (జెడ్పీ హైస్కూల్, చిన్నమట్లపూడి) ప్రదర్శించిన పశుసంవర్ధని దాణామృతం, వీ.బాల అమూల్య (జెడ్పీ హైస్కూల్, సజ్జాపురం) ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ట్రెడిషనల్ రెమెడీస్ ఫర్ ఎనీమియా కింద బీ జ్యోత్స్న (బీవీ అండ్ బీఎస్ గవర్నమెంట్ హైస్కూల్, జాండ్రపేట) ప్రదర్శించిన ఫ్లోటింగ్ లాడిల్స్ ప్రాజెక్టు ఎంపికైంది.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి


మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

అద్దంకి రూరల్: విద్యార్థులు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. జాతీయ బాలల హక్కుల దినోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంలో బాలలకు కల్పించిన హక్కులను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలన్నారు. బడిబయట గుర్తించిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నారు. విద్యార్థులు తమ సమస్యలను ఫిర్యాదుల పెట్టెలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పీ దుర్గాగాయిత్రి, ఏసీడీఎస్ సూపర్‌వైజర్ ఏ. అరుణ కుమారి, ఇందిరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా

భట్టిప్రోలు: భట్టిప్రోలులో శుక్రవారం జరగాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సూచనల మేరకు త్వరలో జరగబోయే తేదీని ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు

- ఆమంచి శ్రీనివాసరావు తస్మాత్ జాగ్రత్త !
- మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల: ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఎమ్మెల్యేగా చీరాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని.. అటువంటి వ్యక్తిపై జనసేన పార్టీ నాయకుడు ఆమంచి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. చీరాల నియోజకవర్గంలో ఒకప్పుడు దుర్మార్గపు పాలన నడిచిందన్నారు. ఆమంచి శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇసుక అక్రమ రవాణా, రౌడీయిజం చేశారన్నారు. ఒకప్పటి దుర్మార్గపు పాలనకు చరమ గీతం పాడి ఎమ్మెల్యే కరణం, ఆయన తనయుడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పారన్నారు. మొన్నటి వరకు వైఎస్సార్ సీపీలో కొనసాగిన ఆయన ఈరోజు వైఎస్సార్ సీపీ నాయకులను విమర్శించడం తగదన్నారు. ఆ మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని టీడీపీ, జనసేన నాయకులకు సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. హింసా రాజకీయాలకు స్వస్తి పలికి నియోజకవర్గంలో స్వేచ్ఛ, ప్రశాంత వాతావరణం నెలకొల్పారన్నారు. అటువంటి ఎమ్మెల్యే గురించి తప్పుగా మాట్లాడడం తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వైస్ చైర్మన్-2 శిఖాకొల్లి రామసుబ్బులు, సర్పంచ్ రమణమ్మ, వేటపాలెం మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, చీరాల పట్టణ-1 అధ్యక్షులు కోండ్రు బాబ్జి, పట్టణ-2 అధ్యక్షులు గుంటూరు మాధవరావు, కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, పార్టీ నాయకులు యాతం మేరిబాబు, పులి వెంకటేశ్వర్లు, కోడూరి ప్రసాద్ రెడ్డి, వాసిమళ్ల వాసు, యానాదిరావు, ఎస్.అనిల్, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు రెడ్లపాలెం విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈఓ రాజారత్నం, హెచ్ఎం చక్రపాణి తదితరులు

పిట్టలవానిపాలెం: గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని ఎంఈఓ రాజారత్నం అన్నారు. మండలంలోని అల్లూరు శివారు రెడ్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను సత్కరించి అభినందించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో రాణించడం వలన ఉద్యోగాల్లో త్వరగా స్థిరపడవచ్చని తెలిపారు. తైక్వాండో ఒలంపిక్ క్రీడ అని దీనికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.చక్రపాణి మాట్లాడుతూ అక్టోబర్ 29వ తేదీన కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న మరుప్రోలు సుబ్రమణ్యేశ్వరరెడ్డి సిల్వర్, బ్రాంజ్ మెడల్ పొందినట్లు తెలిపారు. 5వ తరగతి చదువుతున్న పులుగు హేమశ్రీ సిల్వర్ మెడల్ పొందినట్లు తెలిపారు. వీరిద్దరు డిసెంబర్ 9,10 తేదీలలో మంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మక్బుల్, రమణారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు భవిష్యత్

- విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి
- జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్


ప్రతిభ కనబరచిన విద్యార్థులతో అతిథులు

చీరాల అర్బన్: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని.. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్ అన్నారు. గురువారం మండలంలోని జాండ్రపేట బీవీ అండ్ బీఎన్ ప్రభుత్వ పాఠశాలలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోని పరిశోధనలను ప్రోత్సహించాలన్నదే సైన్స్ కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా స్థాయిలో పోటీలకు వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు 93 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారన్నారు. వీటిలో ఏడు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈనెల చివరి వారంలో గుంటూరు జిల్లాలోని కేఎల్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు బాపట్ల జిల్లా నుంచి ఎంపిక చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా లేళ్ల లీలా కృష్ణ, వలివేటి వెన్నెల, కిరణ్ నందమూడి, మీర్జాన్ తదితరులు వ్యవహరించగా ఆప్కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, న్యాయవాది పన్నెం మల్లికార్జునబాబు, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు, రిసోర్సుపర్సన్ పి.పూర్ణచంద్రరావు, యన్నం యల్లమందేశ్వరరావు, పద్మ, లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల కోసమే కొనుగోలు కేంద్రాలు

మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ


పత్తి నాణ్యత పరిశీలిస్తున్న యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

కొరిటెపాడు(గుంటూరు): పత్తి రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. గుంటూరు నల్లపాడు రోడ్‌లోని కోటేశ్వర కాటన్ ట్రేడర్స్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధరను క్వింటాళ్లకు రూ.7,020గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తాము పండించిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు పత్తిని అమ్ముకోవద్దని సూచించారు. మిర్చియార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్మాలనుకునే రైతులు కచ్చితంగా తమ ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు పట్టాదారు పాసుపుస్తకం నకలుతో సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకొని టోకెన్ పొందాలన్నారు. ఆ తర్వాత సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకు రావల్సి ఉంటుందని సూచించారు. నాణ్యతా ప్రమాణాల మేరకు పంట ఉంటేనే అధికారులు కొనుగోలు చేస్తారన్నారు. పత్తిని ఆరబెట్టి శుభ్రపరచి తీసుకు రావాలని, తేమ శాతం లోపు మాత్రమే ఉండాలని, తేమ అంతకన్నా ఎక్కువ ఉంటే సీసీఐ కొనుగోలు చేయదన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించి పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రం ద్వారా మద్దతు ధర పొందాలని ఆయన వివరించారు.

ఎన్జీవోస్ స్టోర్స్‌కు ప్రజాదరణ



గుంటూరు మెడికల్: గుంటూరులోని ఎన్జీవోస్ స్టోర్స్ బాగా పనిచేస్తోందని, సభ్యులు, ఉద్యోగులందరూ స్టోర్స్‌లోని వినియోగ వస్తువులు కొనుగోలు చేయాలని జిల్లా సహకార అధికారి వీరాచారి అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా గుంటూరు అరండల్‌పేటలోని గుంటూరు సిటీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ కంజూమర్స్ స్టోర్స్ లిమిటెడ్‌లో ఆయన సహకార పతాకాన్ని ఆవిష్కరించి సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా వీరాచారి మాట్లాడుతూ ఉద్యోగులు, సభ్యులు స్టోర్స్‌లోనే వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా ఎన్జీవోస్ స్టోర్స్ బాగా వృద్ధిలోకి వస్తాయన్నారు. స్టోర్స్ అధ్యక్షుడు కడప శ్రీనివాసరావు, విజయవాడ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.రామోహన్, డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి రత్నావళి, స్టోర్స్ ఉపాధ్యక్షుడు ఎస్.కె.మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే వరిలో చీడపీడలు దూరం

వరి పొలాలను పరిశీలించిన డీడీ, శాస్త్రవేత్తల బృందం


అంబడిపూడిలో వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

బల్లికురవ: ఖరీఫ్‌లో బోర్ల కింద సాగుచేసి వరి పొలాల్లో తగిన జాగ్రత్తలు పాటిస్తే చీడపీడలను నివారించుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎం. విజయనిర్మల కోరారు. గురువారం ఆమె గుంటుపల్లి, అంబడిపూడి, ముక్తేశ్వరం గ్రామాల్లోని వరి పొలాలను వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. వరిని ఆకునల్లి, కంకినల్లి ఆశించిందని చెప్పారు. దాని నివారణకు ప్రొఫెనోఫాస్ ఎకరాకు 400 ఎంఎల్‌ను దుబ్బు తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలని సూచించారు. పోషక లోపాల నివారణకు 13-0-45 మందుకు ఎకరాకు రెండు కిలోలు, ఆగ్రోమిన్ మేక్‌తో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. జింకు లోప నివారణకు పైపాటుగా జింకు సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ ఎంపీ ఓబయ్య, శాస్త్రవేత్త ఎస్. సాంబశివరావు, వ్యవసాయ మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, ఏవో ఎస్‌వీపీ కుమారి, రైతులు పాల్గొన్నారు.

సృజనాత్మకత కోసం బాలల చిత్రాలు అవసరం

బాలల చిత్ర దర్శకుడు, సినీ గీతరచయిత డాడీ శ్రీనివాస్


డాడీ శ్రీనివాస్, బాలనటులు శ్రీదేవి, భవ్యశ్రీ, పుష్కర్‌ను సత్కరించిన సొసైటీ నిర్వాహకులు

తెనాలి: బాలల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి చలన చిత్రోత్సవాలు ఎంతో ఉపకరిస్తాయని ప్రముఖ సినీ గీత రచయిత, చిత్ర దర్శకుడు డాడీ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలను ప్రభుత్వాలు క్రమం తప్పకుండా నిర్వహించటం మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ సహకారంతో చిల్డ్రన్ ఫిలిం సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని ఏవీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ థియేటర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవంలో మూడో గురువారం జరిగిన సభకు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి వీర నారాయణరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాడీ శ్రీనివాస్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ప్రభుత్వాలు జరపాల్సిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలను తెనాలిలో ఏటా జరుపుతున్న సొసైటీని అభినందించారు. చిత్రోత్సవాలు ప్రతిభ కలిగిన వారికి ఒక వేదికగా ఉపయోగపడతాయన్నారు. బాలల చిత్రాలకు ప్రభుత్వాలు ప్రకటించిన సబ్సిడీ మొత్తాన్ని సకాలంలో జమ చేసినట్లయితే నిర్మాత, దర్శకులు మరిన్ని మంచి చిత్రాలను తీసేందుకు అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. తాను తీసిన బాలల చిత్రం మట్టిలో మాణిక్యాలకు ద్వితీయ ఉత్తమ బాలల చిత్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది అవార్డుతోపాటు ఉగాది ఎక్స్‌లెన్సీ, జాతీయస్థాయి అంబేడ్కర్ అవార్డులు వచ్చాయన్నారు. ఇప్పటికీ తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు సబ్సిడీ జమ చేయటకపోవటం విచారకరమని శ్రీనివాస్ అన్నారు. తెనాలి దగ్గర్లోని దుండిపాలెం నుంచి కట్టుబట్టలతో వెళ్లిన తాను, అనేక కష్టాలను అనుభవిస్తూ సినీ రంగంలో పాటల రచయితగా నిలదొక్కుకుని ఇప్పటికి 396 సినిమాల్లో 800 పైగా పాటలు రచించినట్లు చెప్పారు. బింబిసారలో నటించిన బాలనటి శ్రీదేవి, భగవంత్ కేసరి సినిమా బాలనటుడు పుష్కర్, టీవీ, సినిమా, వెబ్ సిరీస్‌ల్లో నటిస్తున్న బాలనటి భవ్యశ్రీ పాల్గొన్నారు. వీరికి సర్టిఫికెట్లను, జ్ఞాపికలను బహూకరించారు. వివిధ సినిమాల్లో వీరు నటించిన సన్నివేశాలను ప్రదర్శించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, వివేకానంద సెంట్రల్ స్కూల్ సీఈవో రావిపాటి వెంకటరామ్, ఏవో సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఫిలిం సొసైటీ ప్రధాన కార్యదర్శి బొల్లిముంత కృష్ణ పర్యవేక్షించారు. తొలుత చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సభానంతరం బాలల చలన చిత్రాలను ప్రదర్శించారు.

గ్రంథాలయాల్లో సభ్యత్వాలు పెంచాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి


బల్లికురవలో మెటీరియల్ అందజేస్తున్న లైబ్రేరియన్

బల్లికురవ: గ్రంథాలయాల్లో సభ్యత్వాలు పెంచాల్సిన బాధ్యత లైబ్రేరియన్లపై ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే ఆదిలక్ష్మి పేర్కొన్నారు. గురువారం బల్లికురవలోని శాఖా గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. అనంతరం గ్రంథాలయంలో సభ్యత్వాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి చెందారు. సభ్యత్వాలు 526 మాత్రమే ఉన్నాయని వాటిని 1000కు పెంచాలని లైబ్రేరియన్ రమేష్‌బాబును ఆదేశించారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి బ్రోచర్, మెటీరియల్‌ను అందజేశారు. వారోత్సవాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని కోరారు.

రైళ్లలో చోరీలకు పాల్పడే వ్యక్తి అరెస్ట్

బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ గంగా వెంకటేశ్వర్లు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): రైళ్లలో టిక్కెట్ రిజర్వేషన్ చేయించుకుని తోటి ప్రయాణికుల మధ్యలో ప్రయాణిస్తూ చోరీలకు పాల్పడే వ్యక్తిని జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు అరెస్ట్ చేశారు. సీఐ కథనం ప్రకారం స్టేషన్లో గురువారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేస్తుండగా బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంకు చెందిన దేవరపల్లి శ్రీకాంత్ అనే వ్యక్తి పరారీ అయ్యేందుకు ప్రయత్నించాడు. వెంబడించి పట్టుకుని స్టేషన్‌కు తరలించి వివరాలు రాబట్టారు. నిందితుడు దొంగిలించి రెండు ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్, బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రైలు నెంబర్ 17626 రేపల్లె-సికింద్రాబాద్ రైలు చోరీ చేసేందుకు అనుకూలంగా ఉంటుందని ఆ రైలులో ఏసీ బోగీలో రిజర్వేషన్ చేసుకుని నిందితుడు ముందుగానే పథకం రూపొందించుకుంటాడన్నారు. ఈ రైలులోనే పలుమార్లు ప్రయాణికుల వద్ద నుంచి విలువైన వస్తువులు చోరీ చేసినట్లు నేరస్తుడు అంగీకరించాడన్నారు. ఈఘటనలో కోర్టు నిందితుడికి రిమాండ్‌కు విధించిందని సీఐ తెలిపారు.

న్యుమోనియా లక్షణాలపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి


వైద్యశాలలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైద్యులు

నరసరావుపేట: చలికాలంలో చిన్నపిల్లల్లో వచ్చే న్యుమోనియో లక్షణాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి కోరారు. గురువారం స్థానిక పల్నాడురోడ్డులోని ఏరియా ఆసుపత్రిలో బాలింతల వార్డులో చిన్నపిల్లల్లో వచ్చే శ్వాసకోశ వ్యాధుల గురించి తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా చిన్నపిల్లల్లో వచ్చే న్యుమోనియో లక్షణాల గురించి, తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. చిన్నపిల్లలు పాలు తాగలేకపోవటము, శ్వాస తీసుకోవటం కష్టంగా ఉండటం, గురక లక్షణం, మూర్ఛలో ఉన్నప్పుడు వెంటనే వైద్యుని సంప్రదించి పిల్లలకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. ఈ చలికాలంలో పిల్లలకు వెచ్చదనం కల్పించాలని, తల్లిపాలు ఇవ్వాలని తల్లులను కోరారు. ఈనెల 12వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 29 వరకు అవగాహన నిర్వహిస్తామన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్, డాక్టర్ నాగ పద్మజ, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ అనిల్, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, ఏరియా ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు గురుకుల విద్యార్థినులు


విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మేరీ మంజుల, పీడీ మహబూబీ

విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు దీపిక భువన, ప్రియాంకలు ఈ నెల 11న విజయవాడలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మేరిమంజుల గురువారం తెలిపారు. అలాగే అదే రోజు జరిగిన రెజ్లింగ్ పోటీలలో గౌతమి సిల్వర్ మెడల్, బ్యూలా బ్రాంజ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ నెల 11న అండర్-19 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో బి.అంజలి, స్నేహ బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పోటీలలో విజేతలను ప్రిన్సిపాల్ మేరీ మంజుల, వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, పీడీ మహబూబీ, పీఈటీ నసీమ, ఉపాధ్యాయినులు చెంచులక్ష్మి, పుష్పలీల అభినందించారు.